

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

గడ్డిఅన్నారంలో బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ సరూర్‌నగర్ లోతట్టు ప్రాంతంలో అవసరం ఉన్న ప్రదేశంలోనే నూతన వరద నీటి బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. రెడ్డి బ్రదర్స్ వీధి నుంచి వీవీనగర్ వరకు నూతనంగా నిర్మించతలపెట్టిన నూతన బాక్స్‌డ్రెయిన్ నిర్మాణాన్ని మరొక చోటకు తరలించాలని రెడ్డి బ్రదర్స్ వీధివాసులు, వీవీనగర్ కాలనీ ప్రజలు శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి విన్నవించారు. రెడ్డి బ్రదర్స్ వీధి నుంచి వీవీనగర్ వరకు 1200 ఎం.ఎం.డయా ట్రంక్ లైన్ నిర్మాణం ఇప్పటికే పూర్తైన నేపథ్యంలో, మరొక లైన్‌ను చేపట్టడం వల్ల ఉపయోగం లేదని వివరించారు. దీంతో డివిజన్ పరిధిలో వరదనీటి డ్రెయిన్ అవసరం ఉన్న చోటుకు ఆ నూతన లైన్ నిర్మాణం చేపట్టేందుకు తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రమేష్‌ముదిరాజ్, రమణారెడ్డి, యాద శంకర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో సమస్యలను పరిష్కరించాలి

చంపాపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని నెహ్రూనగర్ కటికోనికుంటకాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త బీసుకుంట్ల సతీష్‌గౌడ్ శనివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో 15సంవత్సరాల క్రితం చేపట్టిన రహదారులు గుంతలమయంగా మారినట్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని వారు ఎమ్మెల్యేకు వివరించారు. నూతనంగా సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సతీష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి పి.యాదయ్య, కాలనీ ప్రతినిధులు యాదగిరి, శ్రీశైలం, అంజయ్య, సంతోష్‌కుమార్, బాలరాజ్, రమేష్ పాల్గొన్నారు.



చీఫ్‌విప్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు శశికాంత్ తదితరులు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయండి

వనస్థలిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని పలు కాలనీల అధ్యక్షులు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అదేవిధంగా రోడ్లు, ట్రంక్‌లైన్, డ్రైనేజీ, వీధిలైట్లు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్పందించిన విప్ మహేందర్‌రెడ్డి గ్రేటర్ వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డితో ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో బృందావన్ మీడోస్ కాలనీ అధ్యక్షుడు శశికాంత్, శ్రీనివాసకాలనీ అధ్యక్షులు చిత్తరంజన్, విద్యారెడ్డి, వేణు, లింగారెడ్డి, రఘుమారెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. శనివారం ఆయన ఎల్బీనగర్ జెడ్సీని కలిసి మూసీ పరీవాహక ప్రాంతంలో హైడ్రా చేపట్టిన నిర్మాణాల కూల్చివేతలతో సత్యానగర్ జనప్రియ అవెన్యూ అపార్టుమెంట్లలో ఉండేవారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ప్రస్తావిస్తూ, ఇతర కాలనీల సమస్యలనూ వివరించారు. జనప్రియ అవెన్యూ తదితర నిర్మాణాలకు హెచ్ఎండీ అనుమతులు ఉన్నాయని, హైడ్రా నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చొరవ తీసుకోవాలని ఆయన జెడ్సీని కోరారు. కొత్తపేటలో పలు చోట్ల వీధిదీపాల కొరత ఉందని, కొత్తపేట విలేజీలో, సత్యానగర్‌లో హైమాస్ట్ లైట్ల సమస్యలు ఉన్నాయన్నారు. పలు చోట్ల సీసీరోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.



జెడ్సీకి సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 6వ వార్డులో రూ. 30లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి స్థానిక కౌన్సిలర్ పసుల రాజేందర్‌ముదిరాజ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశలవారీగా అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారుల, ప్రజల సహకారంతో పెద్దఅంబర్‌పేట్‌ను అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి, నాయకులు నర్సింగ్, సంజీవ, కాలనీవాసులు పాల్గొన్నారు.

తారామతిపేటలో అభివృద్ధి పనులు చేపట్టండి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో విలీనమైన తారామతిపేటలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ శనివారం మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్, వాటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రోడ్డుకిరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దానికి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ. 8,792 కోట్లను విడుదల చేయాలన్నారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. మీసాల స్టాలిన్, ప్రణయ్, ప్రియాంక, అక్షర, వంశీ, ఉపేందర్ పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. మట్టి తీయడం మరిచారు

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట మున్సిపల్ కాలనీలో సీసీ రోడ్డు వేశారు. రోడ్డు నిర్మాణం కోసం తవ్విన మట్టిని, రాళ్లకుప్పలను మాత్రం తీయడం మరిచిపోయారు. నెల రోజుల నుంచి మట్టికుప్పలు, రాళ్లు నడిరోడ్డుమీద దర్శనమిస్తున్నాయి. రోడ్డుపైన మట్టికుప్పలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వాహనదారులు మట్టికుప్పల వద్ద ప్రమాదాలకు గురవుతున్నా మట్టికుప్పలు తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ కానీ మున్సిపల్ సిబ్బంది కానీ మట్టికుప్పల వైపు చూడడం లేదు. పోచమ్మగుడి ముందు అర్బన్ ఆరోగ్యకేంద్రం నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీ రోడ్డు వేశారు. పాత రోడ్డు తవ్విన మట్టిని, రాళ్లను అక్కడక్కడ రోడ్డు మీదనే కుప్పలుగా పోశారు. నెల రోజులుగా రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నా వాటిని తొలగించే వారే లేరు. పోచమ్మగుడి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. గుడి ఎదుట పెద్ద మట్టికుప్ప ఉండడంతో దేవాలయానికి వచ్చేవారు, అటువైపుగా కాలనీలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టి సారించి మట్టికుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



గుడి ముందు ఉన్న రాళ్లకుప్పలు



పోచమ్మగుడి సర్కిల్‌లో నడిరోడ్డు మీద ఉన్న మట్టికుప్ప

ఐటీని అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు

- ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ

మన్సూరాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిత్యం సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేస్తూ ఐటీ రంగం ముందుకు దూసుకెళ్తోందని, విద్యార్థులు దీనిని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో శనివారం అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉమాంగ్-2కే24 పేరిట ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ కళాశాల చైర్మన్, ఫౌండర్, ఏపీ మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో వచ్చే చిన్న చిన్న సమస్యలకు వెనకడుగు వేయకుండా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కళాశాల ఫౌండర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్ముందు ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఐటీ, మిషనరీల మయం కాబోతుందని, ఈ రంగాల్లో నైపుణ్యతను పెంచుకోవాలని సూచించారు. అనంతరం పలు క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ వేడుకల్లో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, టెక్ మహీంద్రా హెడ్ ట్రైనర్ సిద్దిఖీ అహ్మద్, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు ఆర్.రవికుమార్, అవంతి గ్రూప్ ఆఫ్ కళాశాల అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరీ, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రియాంక, ఎండీ ఐ.శ్రవణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వీరసోమయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

పారిశుధ్య సమస్యపై బీజేపీ నేతల వినూత్న నిరసన

- చెత్తకుప్పల్లో నిలబడి ప్లకార్డుల ప్రదర్శన

సరూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిందని, చెత్త సమస్యను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారని బీజేవైఎం నేతలు విమర్శించారు. స్వయానా మేయర్ సొంత డివిజన్‌లోనే గుట్టలుగా చెత్త పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే లేడని వారు ఆరోపించారు. బడంగ్‌పేట్‌లో చెత్త సమస్యపై బీజేపీ యువమోర్చా బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. 'ఐ లవ్ బడంగ్‌పేట్' అనే ఆంగ్ల అక్షరాలతో కూడిన ప్లకార్డులను పట్టుకుని చెత్త కుప్పల మధ్య, మురుగు కాల్వల వద్ద నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో అధికారులు, పాలకులు మాటలకే పరిమితమయ్యారని, కనీసం చెత్తకుప్పలు తొలగించడంపై కూడా దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. మేయర్ డివిజన్‌లోనే చెత్త సమస్య తీవ్రంగా ఉన్నదని, ఇది అధికారులకు కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం సైతం చెత్త కుప్పల్లాగే పేరుకుపోయిందని ఆయన ఆరోపించారు. మేయర్, కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డివిజన్లలో పర్యటించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య ఇలాగే కొనసాగితే తమ పార్టీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎమహేందర్, గోపాల్, సాయిసంతోష్, లక్ష్మణ్, సైదులు, నరేశ్, ప్రవీణ్‌గౌడ్, జి.మల్లేశ్, శివ, శ్రీరాములు, రాజేశ్, మహేందర్ పాల్గొన్నారు.



చెత్తకుప్పల్లో 'ఐ లవ్ బడంగ్‌పేట్' ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు



స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్‌తో ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్, సిబ్బంది

హాష్ ఆయిల్ పట్టివేత

సైదాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు 180 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ వివరాలు వెల్లడించారు. మలక్‌పేటకు చెందిన ఎం.మాణిక్యప్ప, అంబర్‌పేటకు చెందిన దుర్గాప్రసాద్‌లు వైజాగ్ అరకులో గుర్తు తెలియని వ్యక్తి నుంచి హాష్ ఆయిల్ కొనుగోలు చేసి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మలక్‌పేటలో నిందితులను అరెస్ట్ చేసి 180 గ్రాములు హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ సుజాత, సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు, సురేందర్‌రావు, శంకర్, వినోద్‌కుమార్, విక్రం, రాము, ప్రియాంక, జితేందర్ పాల్గొన్నారు.

జైలు అదాలత్‌లో 95 కేసుల పరిష్కారం

- 84మంది ఖైదీలకు విముక్తి

సైదాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో శనివారం నిర్వహించిన జైలు అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించగా 84మంది అండర్ ట్రయల్ ఖైదీలకు విముక్తి లభించింది. నాంపల్లి క్రిమినల్ కోర్టు, రైల్వే, ఫ్యామిలీ, ఎక్సైజ్ కోర్టుకు సంబంధించిన కేసులు పరిష్కరించారు. సుమారు 12మంది వివిధ కోర్టుల న్యాయమూర్తులు పాల్గొని కేసుల విచారణ చేపట్టి ఖైదీలకు విముక్తి కలిగించారు. ఖైదీలకు సత్వర న్యాయం అందేందుకు జైలు అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్‌రెడ్డి, దేవ్లా, జైలర్లు దేవ్‌సింగ్, జలందర్, అచ్చయ్య, తిరుమల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉమానాగలింగేశ్వర ఆలయంలో హుండీలో డబ్బు చోరీ

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంకు కాలనీలోని ఉమానాగలింగేశ్వర ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ తాళం పగులగొట్టి డబ్బు ఎత్తుకెళ్లారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రల్ బ్యాంకు కాలనీలోని ఉమానాగలింగేశ్వర ఆలయాన్ని శుక్రవారం రాత్రి 8గంటలకు ఆలయ గేటుకు తాళం వేసి సూపర్‌వైజర్ వెళ్లిపోయాడు. శనివారం ఉదయం 5.30 గంటలకు అతడు ఆలయం గేటు తెరిచి లోపలికి వెళ్లి చూసే సరికి హుండీ కనిపించలేదు. వెంటనే అతడు అంతటా వెతకగా హుండీ ఆలయం వెనుక కనిపించింది. హుండీ తాళం పగులగొట్టి ఉంది. అందులోని డబ్బు కనిపించలేదు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సరూర్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని ఆర్‌సీఐ డిఫెన్స్ ల్యాబ్స్ స్కూల్‌లో శనివారం డాక్టర్ నారీ ఫౌండేషన్, హ్యాండ్స్ ఆన్ హార్ట్, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఛాతీ ఆస్పత్రికి చెందిన రెస్పిరేటరీ థెరపిస్టులు మానవుడి నమూనా ఆకృతులను విద్యార్థులకు అందజేసి సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో నమూనా ఆకృతులపై సీపీఆర్ చేయించారు. గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తులకు మాత్రమే సీపీఆర్ చేయాల్సి ఉంటుందని, అది కూడా అవసరమైతేనే చేయాలని వారు సూచించారు. సీపీఆర్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉంటే అత్యవసర పరిస్థితుల్లో కొందరి ప్రాణాలను కాపాడడానికి ప్రయత్నించగలుగుతారని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ యోగేశ్‌శర్మ, ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్‌రెడ్డి, ఏవీరావు, బీఎస్ శ్రీనివాస్, విభాశ్రీవాత్సవ, అశోక్‌కుమార్, అపర్ణ, రూపాదేవి, ఆదర్శ్ వైద్యులు డాక్టర్ అనితా భల్లా, డాక్టర్ కీర్తనయాదవ్, డాక్టర్ హైందవి, చంద్రిక పాల్గొన్నారు.



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఛాతీ ఆస్పత్రి వైద్యులు

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత

చాదర్‌ఘాట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హైదరాబాద్-2లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో డిపో ఆదాయాన్ని పెంచడంలో ప్రత్యేక చొరవ చూపిన 20 మంది డ్రైవర్లు, మరో 20 మంది కండక్టర్లు ఎంపికయ్యారని డిపో మేనేజర్ కె.కృష్ణమూర్తి తెలిపారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపోలో జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో డిపో మేనేజర్ 20 మంది డ్రైవర్లకు, మరో 20మంది కండక్టర్లకు నగదు పురస్కారాలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ హైదరాబాద్-2 డిపోలో ప్రతి మూడు మాసాలకోసారి జరిగే త్రైమాసిక ఉత్సవాల్లో డిపో ఆదాయాన్ని పెంచడంతో పాటు ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను ఎంపిక చేసినట్లు వివరించారు. ఇలా ఎంపికైన ఉద్యోగులు ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వీరు నిర్వహించే విధులను ఇతర ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.ఉషశ్రీ, మెకానికల్ ఫోర్‌మెన్ సతీష్‌కుమార్, కె.రమాదేవి, ఉమాపతి పాల్గొన్నారు.



ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న డిపో మేనేజర్ కృష్ణమూర్తి

ఇనాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ హాజరై సుమారు 100 మంది కార్యకర్తలకు సభ్యత్వాలను అందించారు. కార్యక్రమంలో పాపయ్యగౌడ్, ఎంపీ యాదగిరిగౌడ్, అంతటి శ్రీకాంత్‌గౌడ్, సాయికిరణ్, నరేష్, నాగరాజు, శంకర్, కరుణాకర్, వెంకటేష్, విఘ్నేష్, ఉపేందర్, రాము పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంపాపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రహదారిపై పడి ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి చంపాపేట ఎక్స్‌రోడ్ లక్ష్మారెడ్డి గార్డెన్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి(55)మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లింగరాజు, సిబ్బంది అక్కడికి చేరుకొని వ్యక్తిని పరిశీలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఒంటిపై తెల్లని షర్ట్, గ్రేకలర్ పాయింట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మూసారాంబాగ్ సాయిలు హట్స్‌లో ఆర్‌బీ ఎక్స్‌గా గుర్తించిన ఇళ్ల కూల్చివేత

చాదర్‌ఘాట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని సాయిలు హట్స్‌లో మూసీనది గర్భంలో ఆర్‌బీ ఎక్స్‌గా గుర్తించిన ఇళ్లను శనివారం సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా మూసీ నది గర్భంలో ఉన్న ఇళ్లను సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు ఆర్‌బీ ఎక్స్‌గా గుర్తించిన ఇళ్ల కుటుంబీకులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించిన విషయం తెలిసిందే. వీరిలో కొన్ని కుటుంబాలు, ఉప్పల్‌లోని ప్రతాప్‌సింగారంలోని 2బీహెచ్‌కేకు తరలివెళ్లగా మరి కొన్ని కుటుంబాలు జియాగూడలోని డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలివెళ్లిన విషయం తెలిసిందే. ఇలా ఆర్‌బీ ఎక్స్‌గా గుర్తించిన తర్వాత తరలిన కుటుంబాలకు చెందిన 13ఇళ్లలో ఐదు ఇళ్లను కూల్చివేశారు. మిగతా ఏడు ఇళ్లను సోమవారం కూల్చనున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మలక్‌పేట పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



మూసీ నది గర్భంలో గుర్తించిన ఇళ్లను కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, ఏఎంహెచ్‌వో

సలీంనగర్ సౌత్‌వెస్ట్ పార్క్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్ : మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో గల సౌత్‌వెస్ట్ పార్క్‌లో శనివారం జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ విభాగం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. పార్క్‌లో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తకుప్పల తొలగింపు పనులు చేపట్టారు. మలక్‌పేట సర్కిల్-6 ఏఎంవోహెచ్ అనురాధతో కలిసి మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించారు. శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు శ్రీనునాయక్, నర్సింగ్‌రావు, అక్షయ్, కాలనీవాసులు ఓంప్రకాష్, దినేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో సెంటర్ల నుంచి డోర్ డెలివరీ సౌకర్యం ప్రారంభం

చాదర్‌ఘాట్: ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో సెంటర్ల నుంచి వినియోగదారుల సౌకర్యార్థం డోర్ డెలివరీ సౌకర్యం శనివారం నుంచి ప్రారంభించినట్లు రంగారెడ్డి, నల్గొండ రీజియన్ల లాజిస్టిక్ ఏటీఎం సి.రవీందర్ తెలిపారు. తెలంగాణ నుంచి ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలోని కార్గో కౌంటర్ల నుంచి డోర్ డెలివరీ కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని 31 కౌంటర్ల ద్వారా ఈ డోర్ డెలివరీ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పార్శిళ్లను, పార్శిల్ కవర్లను డెలివరీ పా యింట్ నుంచి ఏజెంట్లకు కనెక్ట్ చేసుకుని కస్టమర్ల ఇంటి వద్దకే చేరవేసేలా ఏర్పాట్లు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు భవనాలు నిర్మించాలి

చాదర్‌ఘాట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళిని శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను అరకొర సౌకర్యాలతో కూడిన ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు తీవ్ర సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలోని అనేక సమస్యలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహాధర్నాకు తరలిరండి : పర్వతాలు

కొత్తపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబరు 5న ఇందిరాపార్కులో జరుప తలపెట్టిన మహాధర్నాకు తరలిరావాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. న్యూ నాగోల్‌లోని ఎస్‌కే డాంగే భవన్‌లో శనివారం ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల సమితి కౌన్సిల్ సమావేశం రాములుగౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పర్వతాలు మాట్లాడుతూ ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, హమాలీలు, భవననిర్మాణ, పెయింటింగ్ కార్మికులు వేలాదిగా తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి శేఖర్‌రెడ్డి, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి చందు, నాయకులు నర్సింహ, మద్దిలేటి, శుక్రునాయక్ పాల్గొన్నారు.

పాషా, నరహరిల సేవలు చిరస్మరణీయం

హయత్‌నగర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఉద్యమ నేతలు మహబుబ్‌పాషా, నరహరిల 35వ వర్ధంతిని శనివారం తుర్కయంజాల్‌లోని సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబుబ్ పాషా, నరహరిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబుబ్ పాషా, నరహరిలు సీపీఎంకి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, అరుణ్‌కుమార్, ఆశీర్వాదం, శంకరయ్య, మధు, జాఫర్, కృష్ణకుమార్, మాధవరెడ్డి, కృష్ణ, విజయ్‌కుమార్, రవికుమార్, భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లి భారత్ వికాస్ పరిషత్ హాల్‌లో శనివారం నిర్వహించిన మార్వెల్యూస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిత్రకారుడు డా. గోనె లింగరాజు